

హనుమకొండలో మాట్లాడుతున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

# కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టాలి

- పాలన చేతకాక రాష్ట్రాన్ని దివాలా తీయిస్తున్న ప్రభుత్వం
- మళ్లీ వచ్చేది బీఆర్‌ఎస్ సర్కారే..
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

హనుమకొండ/వర్ధన్నపేట/పర్వతగిరి, మే 8: కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజలను చైతన్యం చేయాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. వర్ధన్నపేట, పర్వతగిరి మండల కేంద్రాలతో పాటు హనుమకొండలోని తన నివాసంలో ఐనవోలు, వర్ధన్నపేట, పర్వతగిరి మండలాలు, నగర పరిధిలోని 13 డివిజన్ల ముఖ్య కార్యకర్తల సమావేశాల్లో ఆయన మాట్లాడారు. రాష్ట్రాన్ని సమర్థవంతంగా పరిపాలించడం చేతకాక కాంగ్రెస్ ప్రభుత్వం దివాలా తీయిస్తున్నదని అన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి ప్రభుత్వ ఉద్యోగులను ఉద్దేశించి రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉందనేలా మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. దీంతో అనేక పరిశ్రమలు, పెట్టుబడిదారులు వెనకడుగు వేస్తున్నారని అన్నారు. దీని వల్ల రానున్న రోజుల్లో నిజంగానే రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో పడిపోయే ప్రమాదం ఉందన్నారు. కొత్తగా రాష్ట్రం ఏర్పడినా పదేళ్లపాటుగా కేసీఆర్ ముఖ్యమంత్రిగా సమర్థవంతంగా పనిచేశారని, అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా పాలనా దక్షతతో ఎంతో ప్రగతి సాధించేందుకు కృషి చేశారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న తరువాత క్రమంగా రాష్ట్రం అనేక ఇబ్బందుల్లో పడిపోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం సహా మంత్రులు కేవలం దోచుకోవడం, దాచుకోవడంతోనే సరిపుచ్చుకుంటున్నారని అన్నారు. ప్రజలు కాంగ్రెస్ ప్రభు త్వం ఏవిధంగా విఫలమవుతుందో గమనిస్తున్నారని అన్నారు. కష్టపడిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని, వారి కష్ట సుఖల్లో పలుపంచుకుంటానన్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట కొనే దిక్కు లేక రైతులు ఆవేదన చెందుతున్నారన్నారు. హైదరాబాద్‌లో కూర్చొని అందాల పోటీలపై రేవంత్ రెడ్డి సమీక్షలు చేస్తున్నాడని, అన్నదాతల సమస్యలను పట్టించు కోవడం లేదన్నారు. అప్పులు పుట్టడం లేదని మాట్లాడడం అంటే సీఎంగా ఫెయిలయ్యారనే అర్థమన్నారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు ధాన్యం కొనుగోళ్లలో ఎన్నడూ ఇంత ఆలస్యం జరగ లేదని, కాంగ్రెస్ పాలనలో ప్రభుత్వం రైతుల నుంచి తరుగు పేరుతో 5 కేజీల ధాన్యం కట్ చేస్తుందని మండిపడ్డారు. సమావేశంలో బీఆర్ఎస్ వర్ధన్నపేట, పర్వతగిరి మండలాల అధ్యక్షులు తూల్ల కుమారస్వామి, ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు, మండల ఇన్‌చార్జులు ఎల్లావుల లలితాయాదవ్, చింతల యాదగిరి, మాజీ ఎంపీపీ అన్నమనేని అప్పారావు, మాజీ జడ్పీటీసీ మార్గం భిక్షపతి, నాయకులు సిలువేరు కుమారస్వామి, తుమ్మల యాకయ్య, కోమాండ్ల ఎలేందర్‌రెడ్డి, కొండేటి శ్రీనివాస్, కంజర్ల మహేశ్, గోదుమల మధు, మనోజ్ కుమార్, చింతపట్ల సోమేశ్వర్ రావు, చిన్నపాక శ్రీనివాస్, గటిక మహేశ్, చింతల శ్రీనివాస్, దర్శోజు దేవేందర్, మట్టపెల్లి మాధవరావు, డబ్బేట యాలాద్రి, నరేశ్, జంగిలి బాబు, మసాని వెంకట్, విజయ, రాపాక శేఖర్, రంగు కుమార్, రాపాక మధు, బొట్ల భాస్కర్, మాజీ ఎంపీటీసీ మాడుగుల రాజు, మాజీ సర్పంచులు ఏర్పుల శ్రీనివాస్, కొల్లూరు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



ఇంజినీరింగ్ అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్సీ రవీందర్ రావు

# చెరువులకు మరమ్మతు చేయరా?

- తెగి ఏడు నెలలైనా ఎక్కడా పనులు చేయలే
- కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్యం వీడాలి
- ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్ రావు

మహబూబాబాద్ రూరల్, మే 8 : భారీ వర్షాలు వచ్చి చెరువులు తెగి ఏడు నెలలవుతున్నా మరమ్మతులు చేయరా..? ఎక్కడా పనులు చేయలేదని, రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు అన్నారు. గురువారం మహబూబాబాద్‌లోని జిల్లా ఇరిగేషన్ ఇంజినీరింగ్ కార్యాలయంలో చెరువు మరమ్మతు పనులపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా రవీందర్‌రావు మాట్లాడుతూ గతేడాది సెప్టెంబర్‌లో భారీ వర్షాల వల్ల జిల్లాలో మొత్తం 147 చెరువులకు గండ్లు పడ్డాయని, అందులో 134 చెరువులను ఇంజినీరింగ్ అధికారులు గుర్తించారని, రైతులే 50 చెరువులకు తాత్కాలిక మరమ్మతు చేసుకున్నారని అన్నారు. ప్రభుత్వం కేవలం 25 చెరువులకు శాశ్వత మరమ్మతు చేసేందుకు మంజూరు ఇచ్చినా ఇంత వరకు ఎక్కడా పనులు చేయలేదన్నారు. రాష్ట్రంలోనే జిల్లాకు భారీ నష్టం జరిగిందని, స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి జిల్లాలో పర్యటించి రైతులకు ఇబ్బందులు లేకుండా వెంటనే చెరువులకు మర మ్మతులు చేయాలని చెప్పినా ఒక్క చెరువుకు కూడా పూర్తి దశలో పనులు చేయలేదన్నారు. తెగిపోయిన చెరువుల్లో నీళ్లు లేక రైతులు పంటలు పండించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వంలో మాత్రం చలనం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం కమిటీలు, చర్చలు పేరుతో కాలం వృథా చేస్తుందని, రాష్ట్రంలో ఇరిగేషన్ వ్యవస్థ దుర్భరంగా మారిందన్నారు. మళ్లీ వర్షాకాలం దగ్గరకు వచ్చిందని, చెరువుల మరమ్మతు పనులు ప్రారంభం కాలేదన్నారు. కొనుగోలు కేంద్రాల్లో కనీస సౌకర్యాలు లేక, కాంటాలు కాక, ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు లారీలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. భారీ వర్షాల వల్ల తెగిపోయిన చెరువుల శాశ్వత మరమ్మతు పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, ఎడ్ల వేణుమాధవ్, మంగళంపల్లి కన్న, జేరిపోతుల వెంకన్న, కర్పూరపు గోపి, ఎస్ఈ వసంత్ కుమార్, డీఈలు రామచంద్రమూర్తి, రమేశ్, చిట్టిబాబు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.




## వడదెబ్బతో రైతు మృతి

భూపాలపల్లి రూరల్, మే 8 : వడదెబ్బతో రైతు మృతి చెందిన ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాశీంపల్లిలో గురువారం జరిగింది. బంధువుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చిత్తారి చిన్న రాజయ్య (55) గురువారం ఉదయం తన పొలం వద్దకు వెళ్లి పనిచేసి మధ్యాహ్నం తిరిగి ఇంటి వచ్చి, అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు వెంటనే భూపాలపల్లి పట్టణంలోని హాస్పిటల్‌కు తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి వరంగల్‌కు తీసుకెళ్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు.



కాశిబుగ్గ : చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో ఎనుమాముల మార్కెట్ వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న వ్యాపారులు

- 'ఆపరేషన్ సిందూర్'కు సలాం
- ఉగ్రమూకలను మట్టుబెట్టడంపై వెల్లువెత్తుతున్న హర్షం
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సంఘీభావ ర్యాలీలు



# ఆర్మీకి హ్యాట్సాఫ్





**పహల్గామ్ దాడులకు ప్రతీకారంగా** పాకిస్థాన్ ఉగ్రమూకలపై విరుచుకుపడిన సైనికులకు యావత్ సమాజం హ్యాట్సాఫ్ చెబుతున్నది. 'ఆపరేషన్ సిందూర్' విజయవంతంపై ఉమ్మడి జిల్లావ్యాప్తంగా హర్షం వ్యక్తమవుతున్నది. ఎక్కడికక్కడ సంఘీభావ ర్యాలీలు తీస్తూ దేశభక్తిని చాటుతున్నది. వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ పరిధిలో గురు వారం చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో వ్యాపారులు, కార్మికులు, రైతులు జాతీయ జెండాలతో ర్యాలీ తీశారు. మహబూబాబాద్ జిల్లా కురవి, ఇనుగుర్తి మండల కేంద్రాల్లో విద్యార్థులు, అఖిలపక్ష నాయకులు ర్యాలీ చేపట్టి, పాకిస్థాన్ ఖబర్దార్ అంటూ నినాదాలు చేశారు. వరంగల్ జిల్లా వర్ధన్నపేటలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీలో మాజీ మంత్రి దయాకర్‌రావు పాల్గొని మాట్లాడుతూ ఉగ్రవాదాన్ని సమూలంగా తుదముట్టించేందుకు భారతసైన్యానికి దేశ ప్రజలంతా అండగా ఉండాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతు ఇస్తూ రాజకీయాలను పక్కన బెట్టాలని కోరారు. **- వర్ధన్నపేట/కాశిబుగ్గ/ కురవి/ ఇనుగుర్తి, మే 8**

## ఆపరేషన్ సిందూర్‌తో ముందడుగు



హనుమకొండ చౌరస్తా: పాకిస్థాన్, ఉగ్రవాదంపై ప్రతీకార చర్యలు తీసుకునేందుకు ఆపరేషన్ సిం దూర్‌తో ముం దడుగు పడింది. దీని ద్వారా భారత సాయుధ దళాల సామర్థ్యం స్పష్టంగా తెలిసిం ది. ఈ పోరాటం ద్వారా ప్రపంచ వ్యాప్తంగా ఇతర దేశాలకు మనదేశ శక్తి అవగాతం కానుంది.

– సింగారపు శ్యామ్, హనుమకొండ





కురవి : ర్యాలీ నిర్వహిస్తున్న రాజోలు హైస్కూల్ విద్యార్థులు

## ఉగ్రవాదం అంతం కావాల్సిందే..



హనుమకొండ చౌరస్తా: ఉగ్రవాదం అంతం కావాల్సిందే. భారత సైన్యం ప్రదర్శించిన సాహసానికి ఒక భారతీయుడి గా నేను గర్వపడుతున్నాను. మన దేశం ప్రపంచ దేశాలకు ఆదర్శం కావాలి. ఉగ్రవాదాన్ని ఉక్కు పాదంతో అణిచివేయాలి. పాకిస్తాన్‌పై ప్రతీకారం తీసుకోవాల్సిందే. దెబ్బకు దెబ్బ కొట్టాలి. మరిన్ని దాడులు చేసి పాకిస్తాన్ ఉగ్రవాదులను అంతం చేయాలి. – చిర్ర సుమన్, హనుమకొండ

## ఊహకందని రీతిలో విరుచుకుపడాలి



హనుమకొండ చౌరస్తా: పహల్గాం ఉగ్రదాడులకు పాల్పడిన వారిని, వారికి మద్దతిచ్చే వారిపై ఊహకందని రీతిలో విరుచుకుపడాలి. ఉగ్రమూకలను మట్టి కరిపించాలి. పహల్గాం దాడికి భారత్ ప్రతీకారం తీసుకోవడం ప్రతి భారతీయుడి గుండె గర్వంతో ఉప్పొంగిపోతున్నది. పాకిస్తాన్‌పై ప్రతిదాడులు చేయడం హర్షణీయం. – జూలూరి రంజిత్, హనుమకొండ





వర్ధన్నపేట : సైన్యానికి మద్దతుగా ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ మంత్రి దయాకర్‌రావు





ఇనుగుర్తి : ర్యాలీ నిర్వహిస్తున్న అఖిలపక్ష నాయకులు, వ్యవసాయ విద్యార్థులు

## ఉగ్రమూకలకు తగిన శిక్ష పడింది



దామెర: పాకిస్తాన్ ఉగ్రవాద మూకలకు మన దేశం ఆపరేషన్ సింధూర్ పేరిట తగిన శిక్ష విధించింది. ఉగ్రవాదులను ఏరివేయడం ఎంతో అవసరం. దేశ ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకుంటున్న భారత సైన్యం చేసిన ఈ సాహసం ఎంతో గొప్పది. ఆర్మీకి ప్రజలందరు ఎంతో రుణపడి ఉంటారు. పాకిస్తాన్ ఉగ్రవాదులు మన దేశానికి వచ్చి టూరిస్టులను కాల్చి చంపడం దారుణం. దేశ ఔన్నత్యాన్ని చాటేలా మన సైనికులు చేసిన ఈ సాహసం చరిత్రాత్మకం.

– దుబాసి నవీన్, ఎన్‌హెచ్‌ఆర్‌సీ హనుమకొండ జిల్లా చైర్మన్

- మరో ఏడు రోజుల్లో సరస్వతీ పుష్కరాలు
- కాళేశ్వరంలో ఎక్కడి పనులు అక్కడే
- చేసిన వాటికీ వాటర్ క్యూరింగ్ లేదు
- నాణ్యతాలోపంతో నిర్మాణాలకు పగుళ్లు
- దేవాదాయ శాఖ ముఖ్యకార్యదర్శి, కలెక్టర్ పర్యవేక్షించినా నత్తనడకే..
- భక్తులకు ఎదురుకానున్న నీళ్ల కొరత
- మంత్రి ఇలాకాలో ఇదీ పరిస్థితి



త్రివేణి సంగమం వద్ద క్యూరింగ్ లేక పగుళ్లు తేలుతున్న మెట్లు

# ముక్తీశ్వరా.. ఏమిటీ నిర్లక్ష్యం



బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్మించిన వంద పడకల వసతి భవనానికి తుది మెరుగులు దిద్దుతున్న దృశ్యం

జయశంకర్ భూపాలపల్లి, మే 8 (నమస్తే తెలంగాణ): కాళేశ్వర ముక్తీశ్వర ఆలయం వద్ద త్రివేణి సంగమంలో ఈ నెల 15 నుంచి 12 రోజుల పాటు జరిగే సరస్వతీ (అంతర్వాహిణి) పుష్కరాలకు అభివృద్ధి పనులు హడావిడిగా కొనసాగుతున్నాయి. ఆలయానికి పాలక మండలి లేకపోవడం, ఇన్‌చార్జి ఈవోను ఆలస్యంగా నియమించడం, అభివృద్ధి పనులకు నిధు లు ఆలస్యంగా మంజూరు చేయడంతో పనులు పుష్కరాలు ప్రారంభమయ్యేలోగా పూర్తయ్యే అవకాశాలు కనిపించడం లేదు. ఆలస్యంగా చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులు ఆదేశిస్తుండడం తో నాణ్యతను గాలికి వదిలేశారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. చేసిన పనులకు క్యూరింగ్ లేకపోవడంతో నిర్మాణాలు పగుళ్లు తేలుతున్నాయి. ప్రభుత్వం పుష్కర పనుల కోసం రూ.25కోట్లు మంజూరు చేసి నా పనులు పూర్తి చేయడంలో అడుగడుగునా నిర్ల క్ష్యం కనిపిస్తున్నది. దేవాదాయ శాఖ ముఖ్యకార్యదర్శి స్వయంగా పర్యవేక్షిస్తూ ఆదేశాలిస్తున్నా పనులు ముం దుకు సాగడం లేదు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆలయ అభివృద్ధికి రూ. 25 కోట్లు మంజూరు చేసి అభివృద్ధి పనులు చేయగా, కాంగ్రెస్ ప్రభుత్వం పలు పనులను రద్దు చేసిందని, అవి ఎటు మళ్లించారని గ్రామస్తులు ప్రశిస్తున్నారు. మంత్రి ఇలాకాలోని ఈ పరిస్థితులు పాలకులు, అధికారుల పనితీరుకు అద్దం పడుతున్నాయి. వారం రోజుల్లో పుష్కరాలు ప్రారంభం కానుండగా ఇప్పటికీ ఆలయానికి పాలకవర్గాన్ని నియమించలేదు. త్రివేణి సంగమం వద్ద జలాలు అడుగండడంతో పుష్కర స్నానాలకు తిప్పలు తప్పేటట్టు లేదు.

### పుష్కరాలలోగా పూర్తయ్యేనా

కాళేశ్వరంలో పుష్కరా పనులు వారం రోజుల్లో పూర్తయ్యేలా కనిపించడంలేదు. ఈ నెల 10 వరకే పూర్తి చేయాలని దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్య ర్, భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించినా ఎలాంటి పురోగతి లేదు. రూ.25 కోట్లతో 63 పనులు చేయాలని నిర్ణయించినప్పటికీ మళ్లీ ఎస్టిమేషన్ మార్చి పనుల సంఖ్య తగ్గించారు. ముఖ్యంగా పుష్కరఘాట్ వద్ద ఆర్చి పనులు ఇంకా కొనసాగుతూనే ఉండగా, బీఆర్‌ఎస్ హయాంలో నిర్మించిన వంద గదుల వసతి గృహానికి తు ది మెరుగులు దిద్దడంలో తీవ్ర జాప్యం చే స్తున్నారు. పుష్కరాలకు వచ్చే పీఠాధిపతుల విడిది గృహం పనులు అలాగే ఉన్నాయి. వాటర్ ట్యాంకు నిర్మాణం సగం కూడా పూర్తి కాలేదు. కల్యాణ కట్ట, పిండ ప్రదానం చేసే భవనం నిర్మాణ పనులు ఇప్పట్లో పూర్తయ్యేలా లేవు. పుష్కరఘాట్ నుంచి వీఐపీ ఘాట్ వరకు మట్టి రోడ్డు పనులు, మసీదు నుంచి వీఐపీ ఘాట్ వరకు డబుల్ రోడ్డు పనులు కొనసాగుతూనే ఉన్నాయి.

### 'బీఆర్‌ఎస్' పనులు పక్కకు..

కాళేశ్వర ముక్తేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ. 25 కోట్లు మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఆలయ పరిధిలో 32 పనులు చేపట్టి, వీటి పర్యవేక్షణ బాధ్యతలను దేవాదాయ, పంచాయతీరాజ్, అటవీ, ఉద్యానశాఖ, సులభ్ ఇంటర్నేషనల్ సంస్థకు అప్పగించిం ది. ఆలయ ప్రధాన ద్వారం ముందు ఫ్లోరింగ్, కిచెన్‌తో కూడిన హాలు, పేద యాత్రికులు ఉచితంగా వసతి పొందడానికి పదిహేను గదులతో సముదాయం, క్యూ కాంప్లెక్స్, గోదావరి వద్ద పురోహితులు అస్తికల నిమజ్జన పూజలు చేయడానికి, కేశ ఖండనకు కల్యాణకట్ట, అస్తికలు గోదావరిలో కలపటానికి వచ్చే వారు పడుకోవడానికి ప్రత్యేకంగా పదిహేను గదులతో అపరకర్మ మండపం, ఆలయం వద్ద షాపింగ్ కాంప్లెక్స్, వంద గదులతో ధర్మశాల, ఆది ముఖేశ్వరస్వామి ఆలయం సమీపంలో నలభై గదులతో డార్మిటరీ, నది వద్ద ఉన్న స్నానఘట్టాల నుంచి బస్‌స్టేషన్ వరకు డ్రైనేజీ, రోడ్డు నిర్మాణం, ఆలయ ప్రహరీ, ప్రధాన దేవాలయం ముందు మహా, అభిషేక మండపం, సాలహారం, శ్రీరామాలయం వద్ద ఆర్చి, ప్రహరీ, పాకశాల, కొత్త ధ్వజస్తంభం, శ్రీ శివ కల్యాణ మండపం, ఆలయం ఉత్తర, దక్షిణ, పశ్చిమ రాజగోపురాలకు కర్ర డోర్లు, సాలహారం నుంచి సరస్వతీ టెంపుల్ వరకు ప్రహరీ, శ్రీపార్వతి అమ్మవారి ఆలయం మండపం విస్తరణ పనులకు నాడు బీఆర్ఎస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేసి చాలా వరకు పూర్తి చేసింది. మిగిలినవి పూర్తి చేయాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని పక్కన పెట్టింది. ఈ నిధులు ఎటు వెళ్లాయో తెలియని పరిస్థితి ఉంది.



వీఐపీ ఘాట్ వద్ద నిర్మాణంలో ఉన్న కల్యాణకట్ట భవనం



ములుగు మండలం జంగాలపల్లి కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం



గోవిందరావుపేట మండలం చల్వాయిలో పరదాలు కప్పినా తడిసిన ధాన్యం బస్తాలు

# ధాన్యం వర్షార్పణం

కొనుగోలు కేంద్రాల్లో తడిసి ముద్దయిన వడ్లు

**వరుసగా అకాల వర్షాలు** అన్నదాతను కోలుకోలేని దెబ్బ తీస్తున్నా యి. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిచి రైతులకు తీవ్ర నష్టం కలుగుతున్నది. ములుగు జిల్లా కేంద్రంతోపాటు ఏటూరునాగారం, మంగపేట, గోవిందారావుపేట, నర్సంపేటలో గురువారం సాయంత్రం వర్షం దంచికొట్టింది. దీంతో కొనుగోలు కేంద్రాలు, మార్కెట్లలో రైతులు ఆరబోసిన వడ్లు, మక్కలు తడిశాయి. ధాన్యం రాశులపై టార్పాలిన్లు కప్పినప్పటికీ వడ్లు నీటి పాలయ్యాయి. ములుగు మండలం జంగాలపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రంలోని ధాన్యం రాశులు, వడ్ల బస్తాలు తడిసిపోయాయి. కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు పెట్టక జాప్యం చేస్తుండడంతో వర్షాలతో నష్ట పోతున్నామని, తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. **- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్**



ఏటూరునాగారం: టార్పాలిన్‌పై ఉన్న నీటిని ఎత్తిపోస్తున్న తల్లీ కొడుకులు